



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
నవంబర్ 7, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## హైడ్రాను చూసి బ్యాంకర్లు భయపడొద్దు

రుణాలు ఇవ్వండి.. అన్ని అనుమతులున్న వాటిని ముట్టుకోం

మహిళా సంఘాలు, వ్యవసాయానికి అధిక నిధులివ్వండి

బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్: హైడ్రాను చూసి భయపడొద్దంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు ధైర్యం నింపారు. హైడ్రా గురించి ఆందోళన అవసరం లేదని, హైడ్రా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వదని స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన బ్యాంకర్ల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం మహిళలు గౌరవ మర్యాదలతో జీవించేందుకు దోహదపడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ నిర్ణయించిందని, వీలైతే అంతకుమించి వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. కార్పొరేట్ కమర్షియల్ బ్యాంకులు 9 నుంచి 13 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయని, బ్యాంకర్లు సామాజిక బాధ్యతతో

(మిగతా 2వ పేజీలో)

## కొడంగల్ ఎత్తిపోతల్లో సీఎం వాటా ఎంత ఢిల్లీ వాటా ఎంత?



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రెండు సంస్థలకు పనులు పంచి పెట్టి డబ్బులు దండుకునేందుకు కుట్ర..

పొంగులేటి కంపెనీకి మూసీ ప్రాజెక్టు పనులు

సుంకిశాల ఘటనపై నివేదికను సీఎం తారుమారు చేసే చాన్స్

హైదరాబాద్: 'బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిన మేఘా కంపెనీతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ సంస్థకు రూ.4,350 కోట్ల కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు కట్టబెడుతున్నారు. అనుభవం కలిగిన కంపెనీలను టెక్నికల్ బిడ్‌లో అనర్హులుగా ప్రకటించి రెండు సంస్థలకు కేక్ ముక్క ల్లా పనులు పంచి పెట్టి డబ్బులు దండుకునే కుట్ర చేస్తున్నారు. రూ.4,350 కోట్లలో సీఎం వాటా, ఢిల్లీ వాటా ఎంతో చెప్పాలి..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు

(మిగతా 2వ పేజీలో)

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన సీఎం రేవంత్



## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసిన పవన్ కల్యాణ్

ఏపీ క్యాబినెట్ సమావేశం ముగిశాక ఢిల్లీ వెళ్లిన పవన్

అమిత్ షాతో సమావేశం

ఇది మర్యాదపూర్వక భేటీ అని వెల్లడించిన ఏపీ డిప్యూటీ సీఎం

పదవి చేపట్టాక ఢిల్లీ రావడం ఇదే తొలిసారి అని వివరణ



## ట్రంప్ 2.0



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయభేరి

దేశ 47వ అధ్యక్షుడిగా ఎన్నిక..

రిపబ్లికన్ పార్టీ 292..
డెమొక్రటిక్ పార్టీ 223

స్వింగ్ స్టేట్స్ అన్నీ ట్రంప్ పరమే

జనవరి 6న అధికారిక ప్రకటన

స్వర్ణయుగం తెస్తా: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దుమ్ము రేపారు. హోరాహోరీ పోరు తదితర విశ్లేషణలన్నింటినీ తోసిరాజంటూ డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ఘనవిజయం సాధించారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి వెల్లడైన ఫలితాల్లో విజయానికి కావాల్సిన 270 ఎలక్టోరల్ కాలేజీ ఓట్ల మార్కును ట్రంప్ అలవోకగా దాటేశారు. తద్వారా నాలుగేళ్ల విరామం తర్వాత రెండోసారి అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకున్నారు. గ్రోవర్ క్లీవ్‌లాండ్ తర్వాత అమెరికా చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏకైక నేతగా నిలిచారు. ఆ క్రమంలో పలు ఇతర రికార్డులూ సొంతం చేసుకున్నారు. అత్యంత ఎక్కువ వయసులో అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన వ్యక్తిగా కూడా 78 ఏళ్ల ట్రంప్ నిలిచారు. క్రిమినల్ అభియోగాల్లో దోషిగా తేలిన ఏకైక మాజీ అధ్యక్షునిగా ట్రంప్ ఇప్పటికే చెత్త రికార్డును మూటగట్టుకోవడం తెలిసిందే. తాజా విజయంతో అలాంటి చరిత్రతో అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన తొలి నేతగా కూడా నిలిచారు. పైగా పాపులర్ ఓటు కూడా గెలుచుకోవడంతో ట్రంప్ విజయానికి పరిపూర్ణత చేకూరినట్టయింది. 2016లో ట్రంప్ తొలిసారి అధ్యక్షునిగా నెగ్గినప్పుడు ఆయన కంటే ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌కు 28 లక్షల ఓట్లు ఎక్కువగా రావడం తెలిసిందే. ఈసారి మాత్రం దేశవ్యాప్తంగా పోలైన ఓట్లలో ట్రంప్ ఇప్పటికే హారిస్ కంటే ఏకంగా 50 లక్షలకు పై చిలుకు ఓట్ల మెజారిటీ సాధించారు. 20 ఏళ్ల తర్వాత ఈ ఘనత సాధించిన రిపబ్లికన్ అధ్యక్షునిగా నిలిచారు. అంతేగాక తనకు మాయని మచ్చగా మిగిలిన 2020 అధ్యక్ష ఎన్నికల ఓటమి తాలూకు చేదు గుర్తులను కూడా ఈ గెలుపుతో చెరిపేసుకున్నారు. బైడెన్ విజయాన్ని తిరస్కరిస్తూ తన మద్దతుదారులను క్యాపిటల్ హిల్‌పై దాడికి ఉసిగొల్పి క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవడంతో ట్రంప్ రాజకీయ భవితవ్యం ముగిసినట్టేనని అంతా భావించారు. అలాంటి స్థితి నుంచి పుంజుకుని నాలుగేళ్ల తర్వాత ఆయన సాధించిన ఘనవిజయం రిపబ్లికన్ పార్టీలో ఆనందోత్సాహాలు నింపగా 60 ఏళ్ల హారిస్ ఓటమితో డెమొక్రాట్లు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. విజయం ఖాయం కాగానే ట్రంప్ తన భార్య మెలానియాను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ముద్దాడారు. ఫ్లోరిడాలోని తన వెస్ట్‌పామ్ బీచ్ నివాసం వెలుపల భారీగా గుమిగూడిన అభిమానులకు అభివాదం చేశారు. రన్నింగ్‌మేట్ జేడీ వాన్స్‌తో తన ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కుటుంబంతో కలిసి అమెరికా ప్రజలనుద్దేశించి

(మిగతా 2వ పేజీలో)




# ట్రంప్ 2.0



ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. మరోసారి తనపై విశ్వాసముంచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. "అపూర్వమైన, అత్యంత శక్తిమంతమైన ఫలితమిది. అమెరికా చరిత్రలో స్వర్ణయుగానికి నా విజయం నాంది" అని ప్రకటించారు. "భగవంతుడు ఏదో పెద్ద కారణంతోనే నాకు ప్రాణదానం చేశాడని చాలామంది చెప్పింది నిజమేనని ఈ ఫలితాలు రుజువు చేశాయి" అని ప్రచార పర్వంలో తనపై జరిగిన హత్యా ప్రయత్నాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. "ఇది అమెరికా ప్రజల విజయం. అంతేగాక దేశ చరిత్రలోనే అతి గొప్పదైన, కనీవిని ఎరగని రాజకీయ ఉద్యమమిది" అని చెప్పుకొచ్చారు. "నా చివరి శ్వాస దాకా ప్రతి రోజూ మీ కోసం, మీ కుటుంబాల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పోరాడతా. మీ జీవితాల్లో వెలుగులు పంచుతా. ద్రవ్యోల్బణం, అక్రమ వలసలతో సహా అన్ని సమస్యలకూ సమర్ధ పరిష్కారం చూపుతా" అని వాగ్దానం చేశారు. ఫలితాల వెల్లడి ప్రక్రియ పూర్తయి ట్రంప్‌ను అధ్యక్షునిగా లాంఛనంగా ప్రకటించేందుకు మరో రెండు నెలలు పట్టనుంది. అనంతరం జనవరి 20న ఆయన ప్రమాణస్వీకారం చేస్తారు. రెండోసారి శ్వేతసౌధంలో అడుగు పెట్టనున్న ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు దేశాధినేతల నుంచి అభినందనలు, శుభాకాంక్ష సందేశాలు వెల్లువెత్తాయి.

**ముందునుంచీ...**


అమెరికావ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఆ వెంటనే రాష్ట్రాలవారీగా ఓట్ల లెక్కింపు మొదలైంది. మొదటినుంచీ ట్రంప్ ఆధిపత్యమే సాగుతూ వచ్చింది. చూస్తుండగానే ఏడు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. వాటిలో ఒకటైన విస్కాన్సిన్‌లో గెలుపుతో ఆయన 270 ఓట్ల మెజారిటీ మార్కును దాటగానే రిపబ్లికన్ నేతలు, అభిమానులు, మద్దతుదారులు దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయారు. బుధవారం రాత్రి తుది ఫలితాలు వెల్లడయ్యే సమయానికి 538 ఎలక్టోరల్ ఓట్లలో ట్రంప్ 294 సొంతం చేసుకున్నారు. మరోవైపు హారిస్ 223 ఎలక్టోరల్ ఓట్లకే పరిమితమయేలా కన్పిస్తున్నారు. ట్రంప్‌కు 7.1 కోట్ల పై చిలుకు ఓట్లు రాగా ఆమెకు 6.6 కోట్లే వచ్చాయి. 50 రాష్ట్రాలకు గాను అరిజోనా, నెవడా, మెయిన్ ఫలితమే తేలాల్సి ఉంది. అరిజోనాల్లో ట్రంప్ గెలుపు లాంఛనమే కాగా మెయిన్, నెవడాల్లోనూ ఆయన ఇప్పటికే 50 వేల పై చిలుకు ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆ మూడు రాష్ట్రాల్లోని 21 స్థానాలనూ గెలుచుకుని మరోసారి 300 మార్కు అలవోకగా దాటేలా కన్పిస్తున్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో కూడా ఆయనకు 304 ఓట్లు దక్కడం తెలిసిందే. తన ఓటమి ఖాయం కావడంతో హార్వర్డ్ వర్సిటీలో బుధవారం రాత్రి తలపెట్టిన ప్రసంగ కార్యక్రమాన్ని హారిస్ రద్దు చేసుకున్నారు. అధ్యక్షుడు బైడెన్ అభ్యర్థిత్వం పట్ల డెమొక్రాట్ల నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయనకు బదులుగా అనూహ్యంగా బరిలో దిగిన హారిస్‌కు ఈ ఫలితాలు నిరాశ కలిగించేవే. గెలిచి ఉంటే అధ్యక్ష పదవిని అధిష్టించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించేవారు. ట్రంప్, హారిస్ మధ్య పోటాపోటీ నెలకొన్నట్టు కొద్ది నెలలుగా ఎన్నికల సర్వేలన్నీ పేర్కొంటూ రావడం తెలిసందే. స్వింగ్ స్టేట్లలోనూ అదే పరిస్థితి ఉందని చెప్పడంతో ఫలితాలపై సర్వత్రా నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది.

# హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ సామాజిక బాధ్యత స్ఫూర్తిదాయకం

## జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్



విశాఖపట్నం వార్త మిర్రర్ : హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ విశాఖ నగర కాలుష్య నియంత్ర ణకు సామాజిక బాధ్యత వహించి చాలా కృషి చేస్తుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన రెండవ జోన్ ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద హెచ్.పి.సి.ఎల్. సహకారంతో నగర కాలుష్య నియంత్రణ కొరకు 88 లక్షల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి నిధులతో 26,500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణన్ తో కలిసి శ్రీకారం చుట్టి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు హెచ్.పి.సి.ఎల్. సామాజిక బాధ్యతతో అందిస్తున్న మొక్కలను నగర పరిధిలో కాలుష్య నియంత్రణ మరియు పర్యావరణాన్ని పరిరక్షణ కొరకు లబ్దిదారులను మరియు ప్రజలను కూడా భాగస్వాములను చేస్తూ పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణన్ తో కలిసి మొక్కలను నాటారు. ఈ ఆవరణలో మొక్కలు నాటి ఒక నందనవనంగా తయారు చేయాలని జీవీఎంసీ అదనపు కమీషనర్ ఆర్.సోమనారాయణ ను కమిషనర్ ఆదేశించారు. అలాగే హెచ్.పి.సి.ఎల్. ఒక సామాజిక బాధ్యతగా భావించి విశాఖ కాలుష్య నిర్మూలనకు విశేష కృషి చేస్తున్నందుకు గాను హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ అభివృద్ధికి హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ సామాజిక భాధ్యతతో సహకారం అందిస్తున్నందుకు ఆ ప్రాంతాన్ని హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జివిఎంసి కమీషనర్ ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి, కాలుష్యం నిర్మూలనకు హెచ్.పి.సి.ఎల్. ఎప్పుడు తన వంతు సామాజిక బాధ్యతగా వహించి సహాయ సహకారాలు అందించుటకు సిద్దంగా ఉన్నదని కమిషనర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాద రాజు, పర్యవేక్షక ఇంజనీరు గోవిందరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, ఎ.ఎం.ఓ.హెచ్. డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, హెచ్.పి.సి.ఎల్. సీనియర్ మేనేజర్ -పి ఆర్ అండ్ సిస్ ఆర్ కాళీ నరసింహం, తదితరులు పాల్గొని మొక్కలను నాటారు.





# ఆర్చరీలో సత్తాచాటిన సాయి ఆద్య, అధిత్

వార్త మిర్రర్, హైదరాబాద్ : 68 వ తెలంగాణ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికురదు మండలం జరిగిన బాలికల అండర్ 14 ఆర్చరీ క్రీడలో, ఈగ సాయి ఆద్య తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆర్చరీ పోటీలో సాయి ఆద్య అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాన్ని సాధించింది. జిల్లా స్థాయిలో సత్తా చాటిన ఆద్య, రాష్ట్రస్థాయిలోని మెరిసింది. అలాగే రాష్ట్రస్థాయి బాలుర అండర్-14 విభాగం లో ఈగ సాయి అధిత్ ఐదవ స్థానంలో నిలిచాడు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని గెలుచుకున్నాడు.









# కందుకూరు సదర్ సమ్మేళనానికి అనిల్ యాదవ్‌కు ఆహ్వానం

బాలాపూర్, వార్త మిర్రర్ : అఖిల భారత యాదవ మహాసభ కందుకూరు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి దీపావళి పండుగ సదర్ సమ్మేళన కార్యక్ర మానికి విచ్చేయవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపా ధ్యక్షులు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కందు కూరు మండల అధ్యక్షులు పసుపుల పర్వతాలు యాదవ్ , కందుకూరు మండల యా దవ సంఘం పెద్దలు నర్ల రామకృష్ణ యాదవ్, బర్ల హనుమంతు యాదవ్ , పాల జ నార్ధన్ యాదవ్ , సాటు మైసయ్య యాదవ్ , బట్టు అంజనేయులు యాదవ్, నర్ల లిం గమ్మ యాదవ్ , కడారి శివశంకర్ యాదవ్ , మరల రాములు యాదవ్ పాల్గొన్నారు.

# హైడ్రాను చూసి బ్యాంకర్లు భయపడొద్దు

పనిచేయాలన్నారు. మహిళల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వమే బస్సులు కొనుగోలు చేసి వారికి లీజుకు ఇవ్వాలని ఆలోచన సైతం చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుచేసే సూక్ష్మ, మధ్యతర పారిశ్రామిక పార్కుల్లో మహిళలకు ప్రత్యేకంగా కేటాయింపులు చేస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి వన్ టైం సెటిల్‌మెంట్ చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, పురపాలక సంచాలకులు, కమిషనర్ శ్రీదేవి పాల్గొన్నారు. వనరుల సమీకరణ: సామాన్య ప్రజలపై భారం మోపకుండా వనరుల సమీకరణపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆదాయ వనరుల సమీ కరణపై వాణిజ్య పన్నులు, రవాణా, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మైనింగ్, ఎక్సైజ్ శాఖల ఉన్నతాధికారు లతో భట్టి భేటీ అయ్యారు. సమావేశంలో భాగంగా శాఖల వారీగా సాధించిన పురోగతి వివరాలు, ఆదాయ సమీకరణ కోసం రూపొందించిన ప్రణాళి కలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎంకు అధికారులు వివరించారు. భట్టి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే పన్ను ఎగవేతదారులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇసుకను అందరికీ అందుబాటులో ఉంచడానికి కావలసిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుకుమార్ సుల్తానియా, రెవెన్యూ, వాణిజ్య పనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, భూగర్భ గనుల శాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాశ్ పాల్గొన్నారు.

# కొడంగల్ ఎత్తిపోతల్లో సీఎం వాటా ఎంత ఢిల్లీ వాటా ఎంత?

డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మె ల్యే వివేకానంద్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

**గతంలో అరాచక కంపెనీ, ఆంధ్రా కంపెనీ అన్నారుగా..**

'రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 'ఈస్ట్ ఇండియా కంపెనీ'అని పేర్కొన్న మేఘా సంస్థకే ముఖ్యమంత్రి హోదాలో ఇప్పుడు రూ.వేల కోట్ల విలువ చేసే పనులు అప్పగిస్తున్నారు. గతంలో 'అరాచక కంపెనీ', 'ఆంధ్రా కంపెనీ', 'పొలిటికల్ మాఫియా'అని సదరు కాంట్రాక్టు సంస్థపై ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు దానిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? హైదరాబాద్ నగరానికి కృష్ణా జలాలను తెచ్చేందుకు చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ సదరు సంస్థ నేరపూరిత నిర్లక్ష్యం మూలంగా కూలిపోయినా బ్లాక్ లిస్టులో పెట్టకపోవడానికి కారణమేంటో చెప్పాలి. కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని విచారణ కమిటీ ఇచ్చిన రిపోర్టును రేవంత్‌రెడ్డి తారుమారు చేసే అవకాశం ఉంది. ఆ నివేదికను వెంటనే బయట పెట్టాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**గోదావరి జలాల పేరిట రూ.5,500 కోట్ల కుంభకోణం**

'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్'నిబంధన పక్కన పెట్టి మంత్రివర్గ సభ్యుడైన పొంగులేటికి సంబంధించిన కంపెనీకి మూసీ ప్రాజెక్టు పనులు ఇస్తున్నారు. రేవంత్‌కు సహాయ మంత్రిలా వ్యవహరిస్తున్న బండి సంజయ్ కూడా దీనిపై మాట్లాడటం లేదు. ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ గురించి మాట్లాడుతున్న మోదీ ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,100 కోట్లతో ప్రతిపాదించిన పనులు రద్దు చేశారు. ఇప్పుడు అంచనాలు రూ.5,500 కోట్లకు పెంచి మరో భారీ కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. ఈ ప్రాజెక్టును కూడా 'ఈస్ట్ ఇండియా కంపెనీ'కి ఇచ్చేందుకే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. సీఎం చెప్పిన చోట అధికారులు సంతకాలు పెడితే ఉద్యోగాలు ఊడటం ఖాయం..'అని మాజీమంత్రి హెచ్చరించారు. 'అరెస్టులు అంటూ అందరి జాతకాలు చెప్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తాను జైలుకు వెళ్లకుండా చూసుకోవాలి. పొంగులేటి నివాసంలో జరిగిన ఈడీ దాడులపై ఇప్పటివరకు బీజేపీ స్పందించలేదు. ఐటీసీ కోహినూర్ హోటల్లో అదానీ కాళ్లు పట్టుకుని, కడుపులో తలపెట్టి తనను కాపాడాలని పొంగులేటి కోరాడు. రేవంత్ నివాసంలో గౌతమ్ అదానీ కొడుకు కరణ్ అదానీతో నాలుగు గంటల సుదీర్ఘ భేటీ జరిగింది. ఈడీ దాడిలో ఏం జరిగిందో పొంగులేటి చెప్పాలి. అరెస్టుల గురించి చెప్పడానికి పొంగులేటి ఎవరు? వీళ్లు నడిపేది సర్కారా లేక సర్కస్సా?. గొట్టంగాళ్లకు భయపడేది లేదు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటులో కాంగ్రెస్ హస్తం ఉంది. మరమ్మతు చేయకపోవడం వెనుక ఏదో మతలబు ఉంది. కేసీఆర్‌ను బదనాం చేసేందుకు ఈ అరాచక శక్తులు ఎంతకైనా తెగిస్తాయి. కుంభకోణాలను బయట పెడుతున్నందుకు మమ్మల్ని ఇబ్బంది పెట్టే పనులు చేస్తారు. అయినా ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కుల గణన సర్వే లో జాగ్రత్తలు పాటించండి

## ఏలే మహేష్ , గౌరవ అధ్యక్షుడు పద్మశాలి రాజ్యాధికార సమితి.



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి....

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకంగా చేపడుతున్న కుల గణన సమగ్ర సర్వే ఎంతో అద్భుతమైన చారిత్రాత్మక నిర్ణయమని పద్మశాలి రాజ్యాధికార సమితి, గౌరవ అధ్యక్షుడు ఏలే మహేష్ అన్నారు. అయితే కుల గణన సర్వేకు సంబందించిన అధికారులు , వాలంటీర్లు ఇంటింటి కి వచ్చి మీ కుటుంబ సమాచార వివరాలు అడిగినప్పుడు మీ వద్ద ఉన్న విద్యార్హత , ఆధార్ కార్డు లపై ఉన్న కులం , పేరు లను సరైన విధంగా నమోదు చేయించుకోగలరు. కులం , పేరు కు ముందు కానీ, తరవాత కానీ గౌరవ పదాలను కలుపుకుంటూ నమోదు చేయించుకున్నట్లయితే భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే పరిస్థితులు ఉంటాయి. సంక్షేమ పథకాల ఎంపికలో కానీ, ఉద్యోగ ఎంపికలో కానీ , బ్యాంకు ల ఖాతాల నిర్వహణలో కానీ నామిని గా ఉండి వారసత్వ హక్కుల ద్వారా వచ్చే ఆస్తుల విషయంలో కానీ పలు రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కావున ప్రజలందరూ సరైన పేరు ను, కులం పేరు ను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా అవగాహన పెంచుటకు సమాచార హక్కు వికాస సమితి ప్రజా చైతన్యం కొరకు తెలియజేస్తున్నామని ఒక ప్రకటన లో తెలిపారు



## అండగా ఉంటా అధైర్య పడొద్దు.

## రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్..జర్పుల దశరథ్ నాయక్.

కల్వకుర్తి.కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం మరణించిన అశోక్ ఎక్వాయి పల్లి గ్రామ పంచాయితీలో ఏదుల అలివేలు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మృతదేహాలకు నివాళులర్పించారు. తదుపరి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ " 5000 రూపాయలు చొప్పున రెండు కుటుంబాలకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ ఎంపిటిసి లచ్చి రామ్ నాయక్ ఏ యం సి డైరెక్టర్ లాయక్ అలీ నాయకులు చందోజి బిక్షపతి వెంకటేష్, లక్ష్మణ్ సుమన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## జూనియర్ కళాశాల పనుల్ని

## త్వరితగతిన పూర్తి చేయాలి..సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ) .. నవంబర్ 6 === మహేశ్వరం నియోజ కవర్గం లోని సరూర్నగర్ డివిజన్లో అదనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనం పనుల్ని పర్యవేక్షించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దాతృత్వం చాటుకున్న పవన్ కళ్యాణ్ అభిమాని

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 06 చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లో లింగోజి గూడెం 2 వవార్డ్ చెందిన పోలేపల్లి బాలమణి గుండెపోటుతో అకాల మరణం చెందడం జరిగింది. ఆ కుటుంబ స్థితిగతులు తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అభిమాని సుంకరమోని శ్యామ్ చేతుల మీదుగా కొడుకు రాంప్రసాద్ కి 10,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షులు తొర్పునూరి లింగస్వామి,మారుపాక సత్తయ్య, పెద్దగోని జంగయ్య, బాతరాజు దశరథ, మట్టపల్లి యాదగిరి, శ్రీమన్నారాయణ, నల్ల చంద్రశేఖర్, రమేష్, నరేష్,శ్రీను, లింగస్వామి, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సహకారంతో వార్డుల్లో పలు అభివృద్ధి పనులు

కల్వకుర్తి నవంబర్ 6 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మున్సిపాలిటీ పట్టణంలోని 8వ వార్డు నందు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి టీ యుఎఫ్ఐడిసి నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు సీసీ డ్రైన్లు పనులు ప్రారంభించడం జరిగింది. శిశు మందిర్ స్కూల్ ముందు సీ సీ రోడ్డు మరియు డ్రైన్ పనులను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం,బృంగి ఆనంద్ కుమార్, కౌన్సిలర్ గోపిరెడ్డి,లక్ష్మి,చిన్న రాంరెడ్డి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి గారు షాహిద్ కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు శానవాజ్ ఖాన్ సైదులు గౌడ్ రామకృష్ణ సంతు యాదవ్ దున్న సురేష్ నవీన్ రవి కాలనీవాసులు జంగయ్య గణేష్ శేఖర్ శ్రీను ఖాదర్ బాలయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహీంద్రా, చింట్లు ,101 సన్న రకం వరి ధాన్యాన్ని

# రైస్ మిల్లర్లు, ఐకెపి కేంద్రాలు ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మిర్యాలగూడ నవంబర్ 6:- (వార్త మిర్రర్ ప్రతినిధి) సన్న రకం ధాన్యం అటు ఐకెపి కేంద్రం గాని ఇటు రైస్ మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ మహబూబ్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు మహీంద్రా చింట్లు, 101 సన్నరకం వరిధాన్యం పండించారని యాద్గారుపల్లి శివారులో ఉన్న 25 రైస్ మిల్లుల్లో సన్నరకం అమ్మేందుకు వెళితే కొనడం లేదని, అటు ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనడం లేదని ఆయన అన్నారు. ఆ ధాన్యం మిల్లుల యజమానులు కొంటేనే స్టీం బియ్యం చేసుకునే అవకాశం ఉందని ప్రజాప్రతినిధులు, అధికారులు రైస్ మిల్లర్లతో చర్చించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మహీంద్ర చింట్లు, 101 రకం వరిధాన్యం కొనేందుకు ఎవరు ముందుకు రావడం లేదని ఆ వంగడాలను వ్యవసాయ శాఖ నిషేధించాలని కోరారు. ఐకెపి కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహకారం అందించడం లేదని, ఐకేపీ కేంద్రాల ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన విమర్శించారు. దేశానికి వెన్నుముక్కయిన రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ రూపొందించిన పంట కొనుగోలు అంశాలన్నీఎల్ వ్యాపారులకు అనుకూలంగా ఉన్నాయి తప్ప రైతులకు ఏమాత్రం ప్రయోజనం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరికి బోనస్ క్వింటాకు రూ.500లు పొందాలంటే ఐకెపిల ద్వారా రైతులు సన్న ధాన్యాన్ని విక్రయించాలన్న నిబంధన రైతులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అవగాహన లేని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను నియమించడం వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర, రూ.500 బోనస్ ను మిల్లుల వద్ద అమ్మిన రైతులకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరను రూ.2,800 చేసినట్లయితే రైతుల ఖాతాల్లో నేరుగా పడుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించి బోనస్ మద్దతు ధరను కలిపి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నలగొండ జిల్లా స్టార్ క్యాంపెనర్ చైర్మన్ పోలగాని వెంకటేష్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొంగరాల కిరణ్ కుమార్, వేములపల్లి బీసీ సెల్ అధ్యక్షులు చల్ల వెంకన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శీను కిషన్ నాయక్ ఉన్నారు.

# కులగనన ద్వారా రాజకీయంగా మాకు నష్టం వాటిల్లిన వెనక్కి తగ్గం... రాహుల్ గాంధీ

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం

## దాసు సురేష్ బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి...దేశంలో మితిమీరిన ఆర్థిక సామాజిక రాజకీయ అసమానతలను లెక్కగట్టి శాస్త్రీయంగా వాటిని ప్రక్షాళన చేసే దిశగా ముందుకు కొనసాగడానికే కులగణనను నిర్వహిస్తున్నామన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ భుదవారం తెలంగాణ సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో పేర్కొన్నారు.. బ్రిటిష్ పాలనలో దేశంలోని ఒక శాతం సంపన్నుల వద్ద నిల్వ ఉన్న దేశ సంపద 21 శాతం కాగా నేడు ఈ సంపద కొనసాగుతున్న అసమానతల వలన ఒక శాతం సంపన్న వర్గాల వద్ద 22.6% గా నమోదయ్యిందని తెలియజేశారు.. న్యాయవ్యవస్థ , కార్పోరేట్ , మీడియా , ప్రభుత్వ ఉద్యోగాలు ఇలా ఏ వ్యవస్థను చూసినా అవకాశాలు అగ్రవర్ణాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పులు పేదలకు మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. మన దేశంలో కుల వ్యవస్థ అనాదిగా బలంగా ఉందనీ ఇది నిర్మూలించలేని అంశమనీ దాసు సురేశ్ పేర్కొన్నారు.. అసమానతల వలన అవకాశాలకు దూరంగా ఉంచబడుతున్న బలహీనవర్గాల యువకులు , నాయకులు తీవ్రమైన నైరాశ్యంలో ఉండడమే కాకుండా ఇదే అంశం భవిష్యత్తులో దేశ అంతర్ యుద్ధానికి కూడా దారి తీసే పరిణామాలు నెలకొని ఉన్నాయని దాసు సురేష్ పేర్కొన్నారు.. కులగణన ద్వారా రాజకీయంగా నష్టం వాటిల్లినా వెనక్కి తగ్గేది లేదన్న రాహుల్ వ్యాఖ్యలు దేశ రాజకీయల్లో సంచలన నిర్ణయమని దీనిని బీసీ రాజ్యాధికార సమితి సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని తెలిపారు ..రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ ఈ ప్రక్షాళన దిశగా మొదలుపెట్టిన కులగణన కార్యక్రమాన్ని ఇండియా కూటమి, ఎన్డీఏ మిత్ర పక్షాలు రాజకీయ, వివిధ పార్టీలు దేశ ప్రజల ప్రయోజనార్ధం మంచి మనసుతో స్వాగతించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.. రాజకీయాల్లో నూతన ఒరవడికి స్వీకారం చుడుతున్న రాహుల్ కు బిసిలు దేశవ్యాప్తంగా అండగా ఉండనున్నారని, సివిల్ సొసైటీ కూడా రాహుల్ గాంధీకి వెన్నుదన్నుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు .. మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన కులగరణ సమావేశంలో ఆర్థిక అసమానతులపై రాహుల్ గాంధీకి అందించిన ప్రత్యేక రిపోర్టును మీడియాకు దాసు సురేష్ వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్ తదితరులు పాల్గొన్నారు




## విస్డం స్కూల్లో స్కూల్లో ఎఫెక్టివ్ పేరెంటింగ్ కౌన్సెలింగ్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 6 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విస్డం హై స్కూల్లో పోషకులకు విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ సెషన్స్ ఫర్ ఎఫెక్టివ్ పేరెంటింగ్ అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం రోజు ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు ప్రత్యేకంగా ఒక్కొక్కరికి ప్రముఖ సైకాలజిస్టులు శ్రీహరి తిరునగరి, రాజేష్, నరహరి నాయక్, రమేష్, మహేందర్ లు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల యొక్క సర్వాంగీన వికాసం, వ్యక్తిగత భావోద్వేగ, విద్యాపరమైన ఎదుగుదలను అర్థం చేసుకోవడానికి తల్లిదండ్రుల పిల్లల సంబంధాలు బలోపేతం చేయడానికి ఈ ప్రత్యేకమైన కౌన్సిలింగ్ చాలా సహకరిస్తుందని, మొబైల్ అడిక్షన్, డ్రగ్ అడిక్షన్, చదువు పట్ల లక్ష్యం పట్ల శ్రద్ధ కోల్పోతున్న ఈ కాలం పిల్లల పట్ల తల్లిదండ్రులకు ఈ అవగాహన కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందన్నారు. నవంబర్ 7న ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు, 8వ తేదీన నర్సరీ నుండి యూకేజీ పిల్లలకు ప్రత్యేకంగా ఈ కౌన్సిలింగ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 200 మంది పోషకులు, పాఠశాల డైరెక్టర్ నివేదిత రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు, ఐకెపి కేంద్రాలలో

## కోనేలా తగు చర్యలు తీసుకుంటాం లిసబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ, నవంబర్ 6:- (వార్త మిర్రర్ ప్రతినిధి) -మహేంద్ర చింట్లు, 101 వరి సన్నరకం ధాన్యం రైస్ మిల్లర్లు, ఐకేపి కేంద్రాల్లో కొనేలా చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ అన్నారు. బుధవారం రైస్ మిల్లర్లు ఆ రకం ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారని ఆయన దృష్టికి తీసుకురాగా రైస్ మిల్లర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, వెంటనే మిల్లులు సందర్శించి మిల్లర్లతో మాట్లాడాలని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ ను ఆదేశించామని తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన అధికారుల సమావేశం అనంతరం విలేఖరులతో మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోనుగోలుకు చేయడం సిద్ధంగా ఉన్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ పనులు పూర్తీ చేస్తున్నారని, వేగం పుంజుకున్నదని ఆయన తెలిపారు. సమావేశంలో డిఏఓ శ్రీనివాసశర్మ, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడిఓలు, ఎంపీఓలు, గ్రామాల స్పెషల్ ఆఫీసర్లయిన డిఇఇలు, ఎఇలు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన

## సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిన...చిగిరింత పారిజాత

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ) .. నవంబర్ 6 === మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని బడంగ్ పేట్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ రాష్ట్ర కుటుంబ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సర్వే కి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సర్వే ద్వారా కుటుంబ వివరాలు వారి ఆర్థిక మరియు రాజకీయ ఉపాధి ఇలా చాలా విషయాలపై అవగాహన వస్తోంది అని అన్నారు. రాహుల్ గాంధీ నిన్న హైదరాబాద్ లో బిసి కులగణన పట్ల మేధావుల, సంఘాల సభ్యుల అభిప్రాయం తీసుకొని రానున్న రోజుల్లో దేశంలో మొత్తం నిర్వహిస్తామనడం మన రాష్టానికి గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి డీఈఈ జ్యోతి రెడ్డి, నర్సింహ రాజు, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్ రెడ్డి, గౌర రమాదేవి శ్రీనివాస్, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, బండారి మనోహర్, గూడెపు ఇంద్రసేన, బంగారు అనిత ప్రభాకర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దాతృత్వాన్ని చాటుకున్న ముచ్చర్ల జనార్ధనుడు.

## బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

కల్వకుర్తి.ఊర్కొండ నవంబర్ 6 వార్త మిర్రర్ ప్రతినిధి:-మానవసేవే మాధవ సేవ అని నమ్మి ఊర్కొండ మండలం వివిధ గ్రామ ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటున్నారు. నిస్వార్థ ప్రజా సేవకుడు బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాదారం గ్రామంలో అల్లాడి పెద్ద జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ అనారోగ్యంతో అకస్మాత్తుగా మరణించడం జరిగింది. ఈ విషయం పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న కబడ్డీ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డిబాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని కోరుకుంటూ వారి కుటుంబానికి తక్షణ సహాయంగా రూ"5000 రూపాయలు ఇవ్వడం జరిగింది భవిష్యత్తులో కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరైన యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉంది లిసబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ, నవంబర్ 6:- (వార్త మిర్రర్ ప్రతినిధి) ఓటర్ అయిన యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. బుధవారం స్థానిక మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఓటర్ అవగాహన చైతన్య సదస్సును స్వీప్ నోడల్ అధికారి, మిర్యాలగూడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.సదస్సు ముఖ్య అతిథి సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ మాట్లాడుతూ యువత ఓటు రూపంలో దానిని సక్రమంగా వినియోగించుకొని సుపరిపాలన అందజేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని, కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకుంటు, పరిసరాలలో ఉన్న వ్యక్తులను కూడా చైతన్యవంతం చేయవలసిన బాధ్యత అంబాసిడర్స్ పై ఉందని, అందుకోసం భారత ఎన్నికల సంఘం పౌరులకు కల్పించిన వివిధ రకాలైన యాపులను వినియోగించుకొని ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత అంబాసిడర్స్ గా యువతపై ఉందని అన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.హరిబాబు, ఎంఈఓ ఎల్.బాలు, డిప్యూటీ తహశీల్దార్ కల్పన, ఫణి, మాస్టర్ ట్రైనర్ జి. కోటయ్య, డివిజనల్ పంచాయతీ కార్యాలయ సిబ్బంది, కాలేజీ చైర్మన్ మహమూద్ అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ లో సీటు సాధించిన రాయికల్ విద్యార్థి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 6

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన చిట్యాల రాజేశం..లావణ్యల కూతురు చిట్యాల అర్చన...సురభి మెడికల్ కాలేజీ సిద్దిపేటలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. అర్చన ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు వివేకవర్ధని ఉన్నత పాఠశాలలో.... ఆరు నుంచి పదవ తరగతి వరకు విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో చదివింది. ఇంటర్ అల్ఫోర్స్ కళాశాలలో పూర్తి చేసింది. సీటు సాధించిన అర్చనను పలువురు అభినందించారు.



## ఎల్లికల్ గ్రామంలో 400 ఏళ్ల నాటి సూక్ష్మ ఆంజనేయ విగ్రహం - పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

కల్వకుర్తి, నవంబర్ 6 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లికలు గ్రామంలోని శివాలయంలో 400 ఏళ్ల నాటి అరుదైన అతి చిన్న ఆంజనేయ స్వామి విగ్రహం ఉందని పురావస్తు పరిశోధకుడు,ప్లీచ్ ఇండియా ,సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఆయన బుధవారం రోజు గ్రామ శివారులోని శిథిల శివాలయాన్ని,అందులో ఉన్న భిన్నమైన మూడు నంది విగ్రహాలను,కప్పు రాలి పగిలిపోయిన మండపం, నిధుల వేటగాళ్ల గడ్డపారులకు బలైన గర్భాలయం ను పరిశీలించారు.చుట్టూ ప్రాకారంతో ఉన్న శిథిల శివాలయాలను పదిలపరిచి, నంది శిల్పాలను గ్రామంలో పీఠాలపై నిలబెట్టి కాపాడుకోవాలని శివ నాగిరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలోని శివాలయం ధ్వజస్తంభం పీఠం పైన 6 అంగుళాల ఎత్తు నాలుగు అంగుళాల వెడల్పు రెండు అంగుళాల మందంగల సున్నపురాతితో చెక్కిన సూక్ష్మ ఆంజనేయ విగ్రహం,అదే కొలతలతో గణేష్ విగ్రహం ఉన్నాయని,విజయనగర కాలానికి చెందిన 400 ఏళ్ల నాటి చారిత్రక ప్రాధాన్యత గల ఈ అరుదైన చిన్న శిల్పాలను కాపాడుకొని,భావితరాలకు అందించాలని శివనాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మామిడాల ముత్యాల రెడ్డి, బడే సాయికిరణ్ రెడ్డి పాల్గొన్నారు అని ఆయన తెలిపారు.



## కులగణన సర్వే దేశంలోనే చరిత్రత్మకం: సర్వేను ప్రజలు విజయవంతం చేయాలి: ఉప్పల లింగస్వామి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా కులగణన సర్వే ప్రారంభం కావడం ఈ సర్వే దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని అన్నారు నారాయణపూర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి ఈ సందర్భంగా వార్త మిర్రర్ జిల్లా ప్రతినిధి తో మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నాయకులు ఈ సర్వేను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు ప్రజల జీవితాల్లో మరింత వెలుగులు నింపేందుకే ఈ సర్వేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని తెలిపారు సర్వేకు ప్రజలంతా సహకరించాలని ప్రతి ఒక్కరు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు సమాజంలోని సంపదను అన్ని వర్గాలకు సమానంగా పంచాలన్నదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సిద్ధాంతమని అందుకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కులగరణ చేపడుతుందని తెలిపారు తెలంగాణలో నిర్వహిస్తున్న కులగణన దేశంలోనే రోల్ మోడల్ గా నిలవబోతుందని చెప్పారు పెండింగ్లో ఉన్న దశాబ్దాల ప్రజల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పేర్కొన్నారు కాంగ్రెస్ మండల నాయకులు ఉప్పల లింగస్వామి

# విశ్వవిద్యాలయాలకు ఉపాధ్యక్షులుగా ఎంపికైన ఆచార్యులను ఘన సన్మానం





సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 6.... బోధనా రంగంలో ఎంతో సాంకేతికత వచ్చినప్పటికీ, తరగతి గదిలో టీచర్ బోధించే విషయాన్ని ప్రత్యక్షంగా విన్నప్పుడు మాత్రమే సంపూర్ణ అవగాహన ఏర్పడుతుందని ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ అన్నారు. ఆర్ట్స్ కాలేజ్ వేదికగా బుధవారం నాడు, ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ అధ్యక్షతన జరిగిన "విశ్వవిద్యాలయాలకు ఉపాధ్యక్షులుగా ఎంపికైన తెలుగుశాఖ ఆచార్యుల అభినందన సభ"లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీలో వన్ సైడ్ టీచింగ్ కాకుండా తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. ఆ తర్వాత సుదీర్ఘకాలం తెలుగు శాఖలో పనిచేసి ఇటీవలే ఉపాధ్యక్షులుగా నియమించబడిన ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు, ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ తెలుగు శాఖ వివిధ విశ్వవిద్యాలయాలకు వీసీలను తయారు చేసే కర్మాగారమని అన్నారు. నిన్న మొన్నటి వరకు మాతో పని చేసిన ఆచార్యులకు ఉన్నత బాధ్యతలు రావడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కాశీం, మాట్లాడుతూ వెలుదండ నిత్యానంద రావు మంచి టీచరు, పరిశోధకుడు అని కొనియాడారు. అదే విధంగా బంజారా తెగలో పుట్టి, పెరిగి తెలుగు సాహిత్యాలో ఇంత గొప్ప స్థాయికి ఎదిగి నేటి మహిళలకు ఎంతో ఆదర్శంగా ఆచార్య సూర్య ధనుంజయ గారు నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సైదా తలత్ సుల్తానా గారు, వైస్ ప్రిన్సిపల్ డా. బీనవేణి రాములు షెఫర్డ్, ఓయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ రాములు, తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా. ఏలే విజయలక్ష్మి, డా.ఎస్ రఘు, వివిధ శాఖలకు సంబంధించిన ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుడు నాగరాజు కు డాక్టరేట్ ప్రకటించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం.

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 6......మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, ఉస్మానియా విద్యార్థి నాయకుడు సోమపంగు నాగరాజు అలియాస్ (నాగేంద్రబాబు) కు ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ లో పబ్లిక్, ప్రైవేట్ రంగ బ్యాంకుల ఉద్యోగిపై వృత్తిపరమైన ఒత్తిడి ప్రభావం పనితీరు - ఎంపిక యొక్క తులనాత్మక అధ్యయనం. అనే అంశంపై సీనియర్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు పర్యవేక్షణలో పి ఎచ్ డి థీసీస్ సమర్పించినందుకు గాను డాక్టరేట్ ప్రకటిస్తున్నట్టు ఓయు ఒక ప్రకటన విడుదల చేసింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన నాగరాజు చిన్నతనం నుంచి విద్యార్థి, సమాజిక ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టి, 2009 జరిగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం జరిగింది. అంతేకాక ఉస్మానియా వేదికగా జరిగిన అనేక విద్యార్థి, సామాజిక ఉద్యమాలలో చురుకుగా, పాల్గొన్నారు. పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్ల కోసం రాష్ట్రం లో పెద్ద ఎత్తున ఉద్యమం చేయడం జరిగింది.. వైఎస్ షర్మిల స్థాపించిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేసిన నాగరాజు. టీఎస్పీఎస్సీ లీకేజీ , విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై రాజులేని పోరాటం చేశారు నాగరాజు ఎప్పుడు తను చదువును నిర్లక్ష్యం చేయలేదు ఉద్యమాలతో పాటు తన చదువును సమన్వయ పరచుకుంటూ నేడు డాక్టరేట్ డిగ్రీ సాధించటం గొప్ప విషయంగా తోటి



విద్యార్థులు కొనియడుతున్నారు. నాగరాజు కు డాక్టర్ డిగ్రీ రావడం పట్ల పలువురు ప్రొఫెసర్లు విద్యార్థి నాయకులు, స్నేహితులు కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాహుల్ గాంధీకి బీసీలమంతా రుణపడి ఉంటాం

### సమగ్ర కుల సర్వే తో బీసీలకు పెరుగనున్న రాజకీయ ప్రాతినిధ్యం

### మాజీ వార్డు సభ్యులు కుంబర్తి రామకృష్ణ ముదిరాజ్



కల్వకుర్తి,నవంబర్ 6 వార్త మిర్రర్ ప్రతినిధి:- తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీసీ కులగణన చేపట్టి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుతామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ అగ్ర నేత,లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి బీసీలమంతా రుణపడి ఉంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ వార్డు సభ్యులు కుంబర్తి రామకృష్ణ ముదిరాజ్ అన్నారు.మంగళవారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కులగణనకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో హైదరాబాద్ బోయిన్ పల్లి లోని గాంధీ ఐడియాలజీ సెంటర్ లో ఏర్పాటు చేసిన సంప్రదింపులు,సలహాల సదస్సుకు రాహుల్ గాంధీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాజీ వార్డు సభ్యులు కుంబర్తి రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ద్వారా చేపట్టిన కులగణన తో బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుంబర్తి రామకృష్ణ ముదిరాజ్ స్పష్టం చేశారు.ఈ కులగణన తో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడంతో పాటు వెనుకబడిన తరగతులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఈ సర్వే తోడ్పడుతుందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రులకు,పీసీసీ,ప్రజా ప్రతినిధులందరికీ బీసీ వర్గాల పక్షాన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ వార్డు సభ్యులు కుంబర్తి రామకృష్ణ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు.

## అనధికారంగా బాధ్యతలు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



మిర్యాలగూడ , నవంబర్ 6:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ తహసిల్దార్ కార్యాలయంలో అనధికారికంగా 35 సంవత్సరాలుగా అనధికారింగా ఉండి అధికారం చలాయిస్తూ ఎన్నో అక్రమాలకు అవినీతికి పాల్పడుతూ రికార్డులు తారుమారు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి వెంకటరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు వనం మదన్ మోహన్ బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన ఎంతమంది అధికారులు మారిన ఇంతవరకు అతనిపై చర్యలు తీసుకోకపోగా బుధవారం కూడా అదేవిధంగా ఉద్యోగి కంటే ఎక్కువగా దర్జాగా కార్యాలయంలో అధికారం చలాయిస్తున్న వెంకట్ రెడ్డి పై ఇకనైనా గట్టి చర్య తీసుకోవాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 06

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజురైన సీఎం రిలీఫ్ ఫండ్ చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని రాంనగర్ చెందిన కడెం చిట్టెమ్మ (60000) రూపాయల,తోర్పునూరి రాములు (40000) రూపాయల, మార్గం జంగయ్య (27000) రూపాయల చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వర్కల కుమార్ గౌడ్, పాక చిరంజీవి, తోర్పునూరి రవి గౌడ్, తొర్పునూరు బాబుగౌడ్, తొర్పునూరి మల్లేశం గౌడ్, మార్గం నరసింహ యాదవ్, కొత్తోజు కుమార్ స్వామి, మొగుదాల రాములు,బొమ్మిరెడ్డి సంజీవరెడ్డి, ఎర్ర సాని శీను, కాలనీవాసులు ఉష్కాగుల శ్రీశైలం, బుడ్డ సురేష్ ,తదితరులు పాల్గొన్నారు




## పుట్టిన రోజు సందర్బంగా అన్నదానం

రాయికల్ నవంబర్ 6 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట గ్రామం లోని కోమిరెల్లి తన్మయి-రవి గార్ల కూతురు నిహన్య పుట్టినరోజు సందర్భంగా బుధవారం రోజున జగిత్యాల లోని విశ్వకర్మ వృద్ధశ్రమం, వాల్మీకి అవాసం తో పాటు 200 మంది పేదలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో చిరునవ్వులు చిందిస్తూ..చిరంజీవి గా వర్ధిల్లాలని మనస్పూర్తిగా ఆశీస్సులు అందించారు. ఈ సందర్బంగా కిష్టంపేట తాజా మాజీ సర్పంచ్ జానా స్వరూప గోపి మాట్లాడుతూ ఇలా పుట్టినరోజు సందర్భంగా అన్నదానాలు చేయడం చాలా గొప్ప కార్యక్రమం అని మిగతావారు కూడా వీరిని ఆదర్శంగా తీసుకోని పుట్టినరోజు నాడు, పెళ్లి రోజులకు ఇలాంటి పుణ్య కార్యక్రమాలు చేసి బీదల ఆశీస్సులు తీసుకోని బావి తరాలకు మార్గదర్శకం కావాలని అన్నారు.ఈ కార్యక్రమం లో కొమురెల్లి రాధ- భాస్కర్, ఆడెపు హరి కృష్ణ, ఆడెపు వినోద్, కోల రాజ్ కుమార్, మారంపెల్లి గంగారెడ్డి, దానవేణి మల్లేష్, ముత్యాల సతీష్, చాందుపాషా, జోగిని తిరుపతి గౌడ్, బొచ్చు అజయ్, బొంతల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 6

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో గురువారం నుండి శనివారం వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చెరుకు రాజేశ్వర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు హోమ కార్యక్రమం, శుక్రవారం శ్రీ సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవం, శనివారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.



## అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 06 వార్త మిర్రర్ దేవరకొండ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి సేవ ట్రస్ట్ వారి ఆహ్వాన మేరకు బుధవారం నాడు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ఆలయాన్ని సందర్శించి దేవాలయములో అయ్యప్ప స్వాములు వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం 38వ అయ్యప్ప స్వామి మాలధారణ సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ ను అయ్యప్ప స్వామి సేవ ట్రస్ట్ వారు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహా రెడ్డి,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, సీనియర్ నాయకులు శిరందాస్ కృష్ణయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, కౌన్సిలర్ జయ ప్రకాష్, మాజీ సర్పంచ్ ముచర్ల గిరి,నాయకులు ఎల్లయ్య,యువ నాయకులు సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన దుండగులు

### హంతకులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ధర్నా చేపట్టిన దళిత సంఘాలు

పీ.ఏ.పల్లి నవంబర్ 06 వార్త మిర్రర్ నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పెద్ద అడిసర్లపల్లి మండలం పెద్ద గుమ్మడం గ్రామంలో దళిత యువకుడ్ని హత్య చేసి ఆత్మహత్యగా రహస్యంగా మామిడి తోటలో చెట్టుకు వేలాడి ఉంచిన సంఘటన మంగళవారం నాడు రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పి. ఏ .పల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన మస్కా వెంకటయ్య 38 గుర్తుతెలియని దుండగులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతుని భార్య అనుమనితులపై గుడిపల్లి ఎస్ ఐ నరసింహ ఫిర్యాదు చేశారు. అనుమానితులను పట్టుకరకపోవడంతో మృతి భార్య కుటుంబ సభ్యులు కలిసి హత్య చేసిన దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ దళిత నాయకుడు మాతంగి కాశయ్య ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ ప్రభుత్వ రోడ్డుపై కుటుంబ సభ్యులతో పాటు మరి కొంతమంది దళిత నాయకులతో బేటాయించి ధర్నా నిర్వహించారు. హత్యకు కారణమైన అనుమానితులను అరెస్టు చేసిన తర్వాతే పోస్ట్మార్టం అంగీకరిస్తామని భార్య మంజుల రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో దేవరకొండ పోలీసులు సానుకూలంగా స్పందించి అతను ఎవరు చేసినా ఎంతటి వారైనా సమగ్ర విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె ఇవ్వడంతో హత్యకు గురైన మస్క వెంకటయ్య



పునుతదని పరీక్షల కోసం నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ధర్నాలో మృతుని భార్య మసక మంజుల, తండ్రి మసక చంద్రయ్య, తల్లి, సోదరుడు,గ్యార వెంకటయ్య, జిల్లా రాములు, బుర్ర ఎంకన్న, గ్యార నాగయ్య కలిమల శ్రీను, కంబాలపల్లి చంద్రయ్య చంద్ర దోసపాటి వెంకన్న, మహిళలు కుటుంబ సభ్యులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## నూతన హనుమాన్ ఆలయం లో ఘనంగా భజన కార్యక్రమం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 6

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కురుమ పల్లె గ్రామంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన, శ్రీ ఆంజనేయ శివ పంచాయతన యంత్ర విగ్రహ స్థాపన మహోత్సవం కనుల పండుగగా మంగళవారం రోజున భక్తజనుల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం హనుమాన్ భజన మండలి అల్లిపూర్ వారి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అల్లీపూర్ భజన మండలి సభ్యులు మరియు చలిగల్, జగిత్యాల భజనపరులు, కుర్మపల్లి, అల్లీపూర్ గ్రామ నాయకులు, ప్రజలు, మహిళలు అందరు పాల్గొనడం జరిగింది.



## రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్... వైస్ చైర్మన్ ను కలిసిన ఓయూ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్....తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బియ్యాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణ రెడ్డిని అదేవిధంగా వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, సెక్రటరీ ప్రొఫెసర్ బి.శ్రీరామ్ వెంకటేష్ ను కలిసి దీర్ఘకాలిక సమస్యలైన ఓపి ఎస్, సిపిఎస్, హెల్త్ కార్డు పట్ల అదే విధంగా ఎన్నో ఏళ్లుగా శ్రమదోపిడికి గురవుతున్న కాంట్రాక్టు ఉద్యోగులును రెగ్యులరైజషన్, చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. అందుకు చైర్మన్ మన దీర్ఘాకాలిక సమస్యలను త్వరలో ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.



## ఎమ్మార్పీ టీజీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ముదిగొండ ఎల్లేష్ మాదిగ

దేవరకొండ నవంబర్ 06 వార్త మిర్రర్ :హైదరాబాద్ లో మంగళవారం నాడు సుప్రభాత్ హొటల్లో జరిగిన ఎమ్మార్పీఎస్ టీజీ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ వారు ముదిగొండ ఎల్లేష్ మాదిగ ను ఎమ్మార్పీఎస్ టీజీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.ఈ సదస్సులో నల్గొండ జిల్లాకు చెందిన ముదిగొండ ఏల్లెష్ మాదిగ ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటి లోకి తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలోకి నూతనంగా యువ నాయకత్వాన్ని తీసుకొని ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు 30 సంవత్సరాలు దండోరా ఉద్యమం లో యువకులు భుజాన వేసుకొని జాతి కోసం జాతి హక్కుల కోసం ఉద్యమం చేశారని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ముదిగొండ ఎల్లేష్ మాదిగ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అదేవిధంగా రాష్ట్ర పొలిటి బ్యూరో కోర్ కమిటీ సభ్యులకు రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.మాదిగ,మాదిగ ఉపకులాల హక్కుల కై వారి యొక్క సంక్షేమానికి సంఘం ఏ పిలుపునిచ్చిన ముందుంటానని తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదిగొండ ఏళ్లేష్ మాదిగ పేర్కొనడం జరిగింది.



## డబుల్ బెడ్ రూం ఇండ్లను సందర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 06 వార్త మిర్రర్ :

దేవరకొండ పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలని వాసుల సమస్య పరిష్కారం కోసం మంగళవారం నాడు ఆర్డబ్ల్యూఎస్ విద్యుత్ అధికారులతో కలిసి డబుల్ బెడ్ రూం ఇండ్లను సందర్శించి, వారి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,మాజి ఎంపీపీ జాని యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ జాల నర్సింహా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్,మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్, కౌన్సిలర్ జయ ప్రకాష్,యువజన కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,మాజి సర్పంచ్ ముచ్చర్ల గిరి,యువ నాయకులు సుభాష్ నాయక్, పిడిరాజు కుమార్, ఈఈ హుస్సేన్, డిఈ విద్యాసాగర్, ఏడి సైదులు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ నాగేష్,మున్సిపల్ ఏఈ రాజు, పంచాయతీరాజ్ ఏఈ శంకర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వివేక్ పాల్గొన్నారు.



## పుర్రి దుర్గాప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించిన "వాసుపల్లి"

విశాఖపట్నం వార్త మిర్రర్

దక్షిణ పేద ప్రజలకు తానున్నానంటూ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ చెయ్యందిస్తున్నారు. అధికారంలో లేకున్నా ఆగని సాయం దక్షిణ ప్రజలకు అండగా నిలుస్తున్నాయి. వారికి కష్టమైనా, పండగ అయినా, శు భకార్యమైన దక్షిణ ప్రజలకు ముందుగా గుర్తొచ్చేది వాసుపల్లి గణేష్ కుమార్ మాత్రమే. వారి ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరై భరోసాగా నిలబడుతున్నారు. 35 వార్డులో ఇటీవల చనిపోయిన పుర్రి దుర్గాప్రసాద్ పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అలాగే తన వంతు సాయంగా రూ.10,000 లు అందజేశారు. అందువచ్చిన కొడుకు దూరం కావడం చాలా బాధాకరమన్నారు. పుర్రి దుర్గాప్రసాద్ ఆత్మకు శాంతి కలగాలని, ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ కు విశేష స్పందన



విశాఖపట్నం వార్త మిర్రర్ పారిశ్రామికా వాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో జీవీఎంసీ 58 వార్డు శ్రీహరిపురం, శ్రీనివాస్ నగర్ ఏరియాలో ప్రజాదర్బార్ కార్యక్రమానికి నిర్వహించిన విశాఖ ఎమ్మెల్యే గణబాబు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు, కొత్త రేషన్ కార్డులు మంజూరు. ఇంటి పనుల పేరు మార్పుల కొరకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అప్పటికప్పుడు అధికారుల సమక్షంలో ఎమ్ మ్మెల్యే గణబాబు పరిష్కారానికి చొరవ చూపారు, ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులతో త్వరతిగతన సమస్యల పరిష్కారం లాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం స్థానిక ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో జోన్-5, జోనల్ కమిషనర్ బి.రాము., ములగాడ ఎమ్మార్వో భుజంగరావు,, విద్యు త్ అధికారులు ఏ డి.,. జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయర్స్, హౌసింగ్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు మరియు తెదేపా నాయకులు పాల్గొన్నారు

## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ ఆకుల అమర్ నాధ్ మృతి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 6 ... కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఆకుల అమర్ నాథ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న పలువురు పోలీస్ సిబ్బంది, ఆయన స్నేహితులు గుర్రం గూడా లోని ఆయన నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఎంతో సౌమ్యుడు, అందరితో స్నేహంగా ఉండే అమర్నాథ్ మృతితో ఈ ప్రాంతం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## రాష్ట్రస్థాయి అండర్ - 19 హ్యాండ్ బాల్ కు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

### విద్యార్థులను అభినందించిన నేరేడు గోమ్ముఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్

నేరేడు గోమ్ము నవంబర్ 06 వార్త మిర్రర్ :నేరేడు గోమ్ము మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల-కళాశాల లో చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న సబిత,ద్వితీయ సంవత్సరం చదువుతున్న సన్నీ, అశ్విని లు రాష్ట్రస్థాయి అండర్ - 19 హ్యాండ్ బాల్ లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ నేనావత్ లాలు నాయక్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లాలూ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అండర్ - 19 హ్యాండ్ బాల్ పోటీలు ఈనెల 8 9 10 తేదీలలో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగే హ్యాండ్ బాల్ పోటీలలో విద్యార్థులు ఎంపిక రావడం గర్వకారణంగా ఉందని వారన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు విజయం సాధి ంచి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆయన కోరారు. విద్యార్థు లు చదువుతోపాటు క్రీడలలో కూడా మంచి నైపుణ్యతను పెంపొందించు కోవాలని క్రీడలు విద్యార్థులలో చదువుతోపాటు క్రీడలు కూడా దోహదపడతాయి అని ఆయన అన్నారు. వారితోపాటు ఫిజికల్ డైరెక్టర్ కేతావత్ శ్రీను ఉపాధ్యాయులు రాజలత రెహానా బేగం శిరీష చందు కోటేష్ గణేష్ ఉపాధ్యాయ బృందం తోటి విద్యార్థులు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## ధన్వంతరి సేవలో చిన్నారులు

## విద్య తోపాటు దైవిక శక్తి కావాలి అంటున్న బాలలు



హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

హయత్ నగర్ లో వివేకానంద మెడికల్ సెంటర్ నిర్వాకులు నెలకొల్పిన ధన్వంతరి సన్నిధానంలో పెద్దలతో పాటు చిన్నారులు కూడా ధన్వంతర స్వామిని దర్శించుకుంటున్నారు తమ తమ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నారు, చిన్నారులు మాకు విద్యతోపాటు దైవిక శక్తి కూడా కావాలని చిన్నారులు కోరుకోవడం నిజంగా అద్భుతం..! చిన్న పిల్లల్ని సైతం ఆకర్షించేంత ముద్దుగా, మంద హాసంతో దర్శనమిస్తున్నాడు స్వామి. మెడికల్ సెంటర్ కు వచ్చే వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలు వైద్యానికి ముందు , వైద్యం తర్వాత ధన్వంతరి స్వామిని దర్శించుకుని తమ ఆరోగ్యంపై ధన్వంతరి స్వామిని వేడుకొని వెళ్తున్నారు. ఇది నిత్యం జరిగే ప్రక్రియ ..! రాష్ట్రంలో ఎక్కడ ఏ హాస్పిటల్ లో ,క్లినిక్ సెంటర్లలో లేని అవకాశం హయత్ నగర్ లోని వివేకానంద మెడికల్ సెంటర్ లో ధన్వంతరి విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అంటున్నారు ప్రజలు.

## బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో సెంట్రల్ లైటింగ్ సిస్టం మాయం

### -విచారణ జరపాలని కమిషనర్ కి వినతిపత్రం అందజేసిన రామకృష్ణారెడ్డి



వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ) .. నవంబర్ 6 ===

బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బడంగ్పేట్ గ్రామంలో మెయిన్ రోడ్డు పై గతంలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ సిస్టం పాత గ్రామపంచాయతీ నుండి అల్మాస్గూడ మలుపు వరకు వినాయక ఉత్సవాల సందర్భంగా తీసివేశారని తరువాత ఈ సెంటర్ లైటింగ్ కనబడుటలేదని బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కి విచారణ జరిపించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తీసివేసిన సెంట్రల్ లైటింగ్ సామాగ్రి అందుబాటులో ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్నగా మిగిలిందని ఒకవేళ ఉన్నట్టయితే వెంటనే ఇట్టి సెంట్రల్ లైటింగ్ ను ఏర్పాటు చేయాలని లేనియెడల సదరు కాంట్రాక్టర్లపై పూర్తి విచారణ జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ప్రవీణ్ గౌడ్, పవన్ శివ మల్లెల మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి ఉంది... సబితా ఇంద్రారెడ్డిబి

### పోలీసుల కుటుంబాలు రోడ్డు ఎక్కి ధర్నా చేస్తే ఏనాడు పట్టించుకోని బండి సంజయ్

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ) నవంబర్ 6 == మహేశ్వరం నియోజ కవర్గంలోని సరూర్నగర్ డివిజన్లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన లిబిమాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి గతంలో కెసిఆర్ హయాంలో ఇచ్చినటువంటి కళ్యాణ లక్ష్మి ద్వారా లక్ష రూపాయల చెక్కు మాత్రమే అందజేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని వీరందరికీ కూడా భవిష్యత్తులో తులం బంగారం ఖచ్చితంగా ఇవ్వాలని ఎమ్మెల్యే తెలిపారు.అంతేకాకుండా ఏ రంగం చూసినా అతలాకుతలం అయిందని పరిపాలన పై అవగాహన లేకుండా పరిపాలిస్తున్నారని 11 నెలల్లోనే వీరి పరిపాలన ప్రజలకు అర్థమైందని సబితా ఇంద్రా రెడ్డి పేర్కొన్నారు.బండి సంజయ్ ఎంతసేపు కేసీఆర్ కేటీఆర్ లను తిట్టడం తప్ప ప్రజా సమస్యల పైన దృష్టి పెడితే బాగుండు కేంద్రమంత్రి పోలీసుల కుటుంబాలు రోడ్డు ఎక్కి ధర్నా చేస్తే సమస్యలు కూడా తెలుసుకోకుండా రేపు తిట్ల పురాణం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

దేవరకొండ నవంబర్ 06 వార్త మిర్రర్ లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర దేవరకొండ ఆధ్వర్యంలో బుధవారం నాడు దేవరకొండ మండలం గొట్టి ముక్కల గ్రామంలో వైస్ ప్రెసిడెంట్ వనం యాదమ్మ పుట్టినరోజు సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని స్థానిక గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గ్రామంలోని ప్రజలకు పరీక్షలను నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ప్రెసిడెంట్ శివ పార్వతి మాట్లాడుతూ కందుకూరు గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా 90 మందికి ఉచిత నేత్ర వైద్య చికిత్సలు నిర్వహించామని అందులో 10 మందికి శాస్త్ర చికిత్స చేయాల్సిందిగా నిర్ధారించారని ఆమె తెలిపారు.లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర సేవలను గ్రామీణ ప్రజలు ఉపయోగించుకోవాలని అని ఆమె అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ద్వారా పరీక్షలు నిర్వహించి వేలాది మందికి కంటి చూపును అందించింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ ప్రెసిడెంట్ గాజుల ఉషారాణి వనం యాదమ్మ డాక్టర్ హరి శిరందాసు సుదర్శన్ గ్రామ మాజీ సర్పంచ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.